నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలి



అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను తిలకిస్తున్న డాక్టర్ షేక్ మహమ్మద్ రఫీ

మలక్‌పేట: విద్యార్థులు వినూత్నంగా ఆలోచించి నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలని అటల్ ఇన్నోవేషన్ మిషన్ సభ్యులు, భారత ప్రభుత్వ ప్రొఫెసర్ డాక్టర్ షేక్ మహమ్మద్ రఫీ అన్నారు. మలక్‌పేట ఉన్నత పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను సందర్శించి విద్యార్థులు చేసిన ప్రయోగాలను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు మొదట తమ ఆలోచనలు రాసిన తరువాత ఎల్రక్టానిక్ పరికరాలను ఉపయోగించి నమూనాలను తయారు చేయాలన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రావీణ్యతను వెలికితీయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు ఆలోచించి ప్రాజెక్టులు చేసేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి ధర్మేందర్, సైదాబాద్ మండల డిప్యూటీ ఈఓ తిరునగరి రాధాకృష్ణ, హిమాయత్‌నగర్ డిప్యూటీ ఈఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, మెంటర్ మనోజ్, అనిల్, సైన్స్ టీచర్లు రాము, వెంకట్‌రెడ్డి, వనజ పాల్గొన్నారు.

మార్కెట్ పాలకవర్గాల అవినీతిపై విచారణ జరిపించండి: కోట్ల



భట్టి విక్రమార్కకు ఫిర్యాదు చేస్తున్న టీపీసీసీ కార్యదర్శి కోట్ల శ్రీనివాస్

సైదాబాద్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన మార్కెట్ పాలకవర్గాల అవినీతిపై నిజనిర్ధారణ కమిటీ వేసి విచారించాలని టీపీసీసీ కార్యదర్శి కోట్ల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను ఆయన కార్యాలయంలో కలిసి ఈ మేరకు ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నడూ లేనివిధంగా రిజర్వేషన్ల విధానం పెట్టి అర్హులైన వ్యక్తులకు పాలకవర్గంలో చోటు కల్పించకుండా మార్కెట్ కమిటీలను అస్తవ్యస్తం చేశారని ఆరోపించారు. ప్రధానంగా హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ అధికారులు, గత పాలకవర్గం సభ్యులు మార్కెట్‌లో సబ్ కమిటీలు వేయకుండా ట్రేడర్లతో లోపాయికారీ ఒప్పందాలు చేసుకొని జీరో వ్యాపారం చేయించి ధనార్జనే ధ్యేయంగా వ్యవహరించారని ఆరోపించారు. రైతులకు, వ్యాపారులకు మార్కెట్ ప్రాంగణంలో కనీస వసతులు కల్పించడంలో విఫలమయ్యారని తెలిపారు. మార్కెట్ కమిటీ లక్ష్యాలను తుంగలో తొక్కిన సభ్యుల అవినీతిపై విచారణ జరిపించాలని ఆయన కోరారు. గత కమిటీలు రద్దయినందున నూతన మార్కెట్ కమిటీలను త్వరితగతిన ఏర్పాటు చేయాలని డిప్యూటీ సీఎంను కోట్ల శ్రీనివాస్ కోరారు.

వంద రోజుల్లో 'గ్యారంటీ'లు అమలు చేయాలి

వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న పాండురంగా చారి

నాగోలు: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానం మేరకు ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేయాలని వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా (డబ్ల్యూపీఐ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాయబండి పాండురంగాచారి ప్రభుత్వాని డిమాండ్ చేశారు. శుక్రవారం వర్కర్స్ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశం కొత్తపేటలోని రాష్ట్ర కార్యాలయంలో పార్టీ నాయకుడు కొప్పు యాదయ్య అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పాండురంగా చారి మాట్లాడుతూ, ప్రజాపాలన కార్యక్రమంలో అభయ హస్తం కింద స్వీకరించిన కోటి 25 లక్షల 84 వేల దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారులకు ఆయా పథకాలను వంద రోజుల్లో వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతుబంధు ఇప్పటికే ఆలస్యమైందని, రైతుల ఖాతాలో వెంటనే డబ్బు జమ చేసి వారిని ఆదుకోవాలని కోరారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం మంచిదే అయినా.. దీనివల్ల గిరాకీ లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ దేశంలోని బడుగు బలహీన వర్గాలకు ఆత్మగౌరవం దక్కాలంటే రాహుల్ గాంధీ న్యాయ యాత్రకు బదులుగా.. సామాజిక న్యాయయాత్ర చేయాలన్నారు. వర్కర్స్ పార్టీ లీగల్ అడ్వైజర్ తీగలపల్లి రంగాచారి, వర్కర్స్ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎస్.కృష్ణమాచారి, ఎస్వీ రాములు, రాగిరి రాములు, నాగరాజు, గోపిక, నాగలక్ష్మి, ప్రజా నాట్యమండలి కన్వీనర్ ఆకారపు రామాచారి తదితరులు సమావేశంలో మాట్లాడారు.

ట్రాఫిక్ రూల్స్ తప్పక పాటిద్దాం

రోడ్డు ప్రమాదాలు నివారిద్దాం

ఈస్ట్‌జోన్ ఆర్టీఓ సుభాష్ చంద్రారెడ్డి



ఈస్ట్‌జోన్ ఆర్టీఓ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది, వాహనదారులు

మలక్‌పేట: వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఈస్ట్‌జోన్ మలక్‌పేట ఆర్టీఓ వెదిరె సుభాష్‌చంద్రారెడ్డి అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం మూసారంబాగ్ ఆర్టీఓ కార్యాలయంలో 'ట్రాఫిక్ రూల్స్ పాటిద్దాం- రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం' పేరుతో వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్టీఓ మాట్లాడుతూ, వాహనదారులు తప్పకుండా లైసెన్స్ తీసుకోవాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. కారు నడిపేవారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని, సీటు బెల్ట్ పెట్టుకుంటేనే ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకుంటాయని తెలిపారు.

ప్రతీ వాహనానికి ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్ తీసుకోవడంతో పాటు వాటిని క్రమం తప్పకుండా రెన్యూవల్ చేయించుకోవాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దన్నారు. ఈనెల 7 నుంచి 17 తేదీ వరకు బస్సులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి నిబంధనలు పాటించని సీసీ బస్సుల నుంచి రూ.94 వేలు ఫైన్ సేకరించామని తెలిపారు. రోడ్డు నియమాలు పాటిస్తామని వాహనదారులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంవీఐలు రమేష్‌బాబు, అరుణ, ఏఓలు విజయ్, ప్రవీన్, మధుకర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి అభయాంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలు

నాగోలు: డివిజన్ పరిధిలోని బండ్లగూడలోని అజయ్‌నగర్ (న్యూ) శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో అయోధ్య రామ మందిర మహా ప్రతిష్ఠామహోత్స సందర్భంగా శనివారం నుంచి సోమవారం వరకు సంక్షేపరామాయణ హవన ప్రయుక్త సీతారామ శాంతి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామని ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీధరాచార్యులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం దేవాలయంలో విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, మృత్సంగ్రహణం, అంకురార్పరణ, ఆదివారం విశ్వక్సేన ఆరాధన మూర్తి కుంభారాధన, అగ్ని ప్రతిష్ఠా సంక్షేపరామాయణ హవనం, పూర్ణాహుతి, సోమవారం సీతారామ చంద్ర స్వామి శాంతి కల్యాణం నిర్వహిస్తామన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో...) టమోటా లోకల్ 17, వంకాయ 23, బెండ 35, పచ్చిమిర్చి 45, కాకర 45, బీర 35, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 16, క్యారెట్ 32. దొండ 28, ఆలు 23, ఉల్లి 24, గోకర 45, దోస 26, సొర 09, పొట్ల 13, అరటి 09, చిక్కుడు 35, అర్వి 67, మునగ 75, చిలగడదుంప 55, బీట్‌రూట్ 17, కీర 18, ఫ్రెంచ్ బీన్స్ 35, కాప్సికమ్ 50. ఈ ధరలు శనివారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

విభజన హామీలపై కేంద్రం వివక్ష: టీజేఎస్



టీజేఎస్ సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆ పార్టీ నేతలు

మన్సూరాబాద్: రాష్ట్ర విభజన సందర్భంగా తెలంగాణకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని తెలంగాణ జనసమితి (టీజేఎస్) రాష్ట్ర కార్యదర్శి పుష్పలత అన్నారు. నదీజలాల పంపిణీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై నిర్లక్ష్యం చేస్తోందని అన్నారు. విభజన హామీలపై తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ ఆధ్వర్యంలో ఈనెల 21న మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవన్‌లో నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను శుక్రవారం ఎల్బీనగర్‌లో ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుష్పలత మాట్లాడుతూ, కేంద్రప్రభుత్వం నుంచి రావాల్సిన నిధుల విషయంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏనాడు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచలేదని విమర్శించారు. విభజన హామీలు పదేళ్లుగా అమలు కాకపోవటంతో రాష్ట్రం అభివృద్ధిలో వెనుకబడిందని అన్నారు. ఈ నెల 21న జరిగే రాష్ట్ర సదస్సుకు మేధావులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజర్ ఎర్ర వెంకన్న, సంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చిప్పలపల్లి మధు తదితరులు పాల్గొన్నారు.

సామకు బీజేపీ నేతల శుభాకాంక్షలు



సామ రంగారెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ నేతలు

మన్సూరాబాద్: బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి నియమితులైన సామ రంగారెడ్డిని బీజేపీ స్వచ్ఛ భారత్ ఎల్బీనగర్ నియోజకవర్గ కన్వీనర్ గంగదాసు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నేతలు శుక్రవారం ఎల్బీనగర్‌లో శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ ఎల్బీనగర్ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, మన్సూరాబాద్ అధ్యక్షుడు నాంపల్లి రామేశ్వర్, నాయకులు కృష్ణంరాజు, గంగాధర్‌గౌడ్, లయ, ఎంజాల జగన్ పాల్గొన్నారు.

బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడిగా సురేందర్‌రెడ్డికే మళ్లీ అవకాశం



సైదాబాద్: బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడిగా సంరెడ్డి సురేందర్‌రెడ్డికి పార్టీ రెండవసారి అవకాశం ఇచ్చింది. జిల్లాల అధ్యక్షుల జాబితాను ప్రకటించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి భాగ్యనగర్ జిల్లాకు మళ్లీ సురేందర్‌రెడ్డినే నియమించారు. ఈ సందర్భంగా శుక్రవారం సైదాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ, పార్టీ పటిష్ఠతకు కృషి చేసే నాయకులకు, కార్యకర్తలకు బీజేపీలో తప్పనిసరిగా గుర్తింపు లభిస్తుందన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ నియోజకవర్గంలో బీజేపీ గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకొని పని చేస్తామన్నారు.

23 వరకు ఓపెన్ యూనివర్సిటీ పరీక్ష ఫీజు గడువు పెంపు

లింగోజిగూడ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ పరీక్ష ఫీజు చెల్లింపు గడువు ఈ నెల 23 వరకు పొడిగించినట్టు హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యయన కేంద్రం కో ఆర్డినేటర్ శంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ 2, 3వ సంవత్సరం, 5వ సెమిస్టర్ విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. గడువు తర్వాత ఫీజు చెల్లించిన వారికి ఫిబ్రవరిలో జరిగే పరీక్ష రాసేందుకు అవకాశం ఉండదని తెలిపారు. వెంటనే ఆన్‌లైన్‌లో ఫీజ చెల్లించాలని సూచించారు.ఇతర వివరాలకు స్టడీ సెంటర్‌ను ఫోన్ నం. 7382929771 ద్వారా సంప్రదించాలని తెలిపారు.

మైనార్టీ పాఠశాల, కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మన్సూరాబాద్: డివిజన్ పరిధిలోని గణేష్‌నగర్‌లో గల బార్కస్ మైనార్టీ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలల్లో ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ రాణి కాజిపురం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈనెల 18 నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. 5వ తరగతిలో ప్రవేశానికి ముందుగా వచ్చిన మైనార్టీలకు దరఖాస్తులకు ప్రాధాన్యం ఉంటుందని, నాన్ మైనార్టీలకు లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేస్తామన్నారు. అదే విధంగా 6, 7, 8వ తరగతులకు బ్యాక్‌లాగ్ సీట్లకు ముస్లిం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఇంటర్మీడియట్‌లో..

ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర ఎంఈసీ, సీఈసీ కోర్సుల్లో ప్రవేశానికి కూడా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. మరిన్ని వివరాలకు 7995057884, 9866062220 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు

వనస్థలిపురం: అయోధ్య రామ మందిరంలో ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వనస్థలిపురం ఎన్జీఓస్ కాలనీలోని ఎల్లమ్మ ఆలయం, శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర, వనస్థలిపురంల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమాల బ్రోచర్‌ను శుక్రవారం ఆయన విడుదల చేశారు. ఈ నెల 22న వనస్థలిపురం ఛత్రపతి శివాజీ గ్రౌండ్స్‌లో శ్రీరామ జ్యోతి, మహిళలచే లక్ష దీపోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. యాదగిరిరావు, నారాయణరావు, రాంరెడ్డి, కృష్ణారెడ్డి, సురేందర్‌జీ, శ్రీలక్ష్మి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి దేవస్థానంలో...

వనస్థలిపురం ఫేజ్-1లోని మల్లికార్జున స్వామి దేవస్థానంలో అయోధ్య రామ మందిరంలో ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఈ నెల 22 వరకు నిత్యం అఖండ దీపారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

వనస్థలిపురం సీఐగా రవికుమార్ నియామకం

హస్తినాపురం: వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ గా బి.రవికుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు గురువారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. గతంలో ఎల్బీనగర్ ఎస్ఐగా పనిచేసి పదోన్నతిపై చైతన్యపురి సీఐగా పని చేసిన రవికుమార్ ప్రస్తుతం స్పెషల్‌బ్రాంచ్‌లో సీఐగా పని చేస్తున్నారు.

అక్కడి నుంచి వనస్థలిపురం ఎస్‌హెచ్‌ఓగా కమిషనర్ బదిలీ చేశారు. కాగా, ఇక్కడ సీఐగా పనిచేసిన దేప జలేంధర్‌రెడ్డిని ఈనెల 3న మల్టీ జోన్ -2కు బదిలీ చేసిన కమిషనర్.. వనస్థలిపురం డీఐ వెంకట్‌కు ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించారు. ఇప్పుడు రవికుమార్‌ను పూర్తి స్థాయి ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు.

భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడిని కలిసిన బీజేపీ నేతలు



మలక్‌పేట: బీజేపీ భాగ్యనగర్-మలక్‌పేట జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి నియమితులైన సంరెడ్డి సురేందర్‌రెడ్డిని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ మధుసూదన్‌రెడ్డి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ నాయకులతో కలిసి ఆయన్ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. రమేష్‌రెడ్డి, దేవేందర్, సురేందర్,దినేష్, ఉదయ్, సంతోష్, దినేష్, మల్లేశ్ పాల్గొన్నారు.

నేడు హనుమాన్ గుడిలో 'స్వచ్ఛతా కా అభియాన్'

చంచల్‌గూడ: కుర్మగూడ హనుమాన్ ఆలయంలో శనివారం ఉదయం 11 గంటలకు స్వచ్ఛతా కా అభియాన్‌ను నిర్వహిస్తామని కమిటీ సభ్యుడు బండ వెంకట్ రెడ్డి తెలిపారు. అయోధ్య శ్రీరామ మందిరం ప్రారంభోత్సవం నేపథ్యంలో దేశంలోని ప్రతీ ఆలయంలో స్వచ్ఛతా కా అభియాన్ కార్యక్రమం నిర్వహించాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు హనుమాన్ ఆలయంతో పాటు పరిసరాలను శుభ్రం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు సహకరించండి



వాటర్‌వర్క్స్ సీజీఎంకు వినతి పత్రం ఇస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ

సైదాబాద్: డివిజన్ పరిధిలో మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు సహకరించాలని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణా రవీందర్‌రెడ్డి వాటర్‌వర్క్స్ అధికారులను కోరారు. ఈ మేరకు ఆమె శుక్రవారం వాటర్‌వర్క్స్ చీఫ్ జనరల్ మేనేజర్ నాగేంద్రకుమార్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. సైదాబాద్ డివిజన్‌లోని శంకేశ్వరబజార్, ఇంద్రప్రస్థ కాలనీ, కరణ్‌బాగ్, ఎస్‌బీహెచ్ సీ కాలనీల్లో నూతన సెవరేజీ పైప్‌లైన్లు మంజూరు చేయాలని ఆమె కోరారు.

అదే విధంగా డివిజన్‌లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేకంగా ఎయిర్‌టెక్ వాహనాన్ని మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆమె సైదాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ, డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. తమ వినతులకు వాటర్‌వర్క్స్ సీజీఎం సానుకూలంగా స్పందించారని కార్పొరేటర్ తెలిపారు.

సమావేశానికి భారీగా తరలిరండి

చాదర్‌ఘాట్: తెలంగాణ భవన్‌లో శనివారం నిర్వహించే బీఆర్‌ఎస్ హైదరాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశానికి పాతబస్తీ నుంచి పార్టీ కార్యకర్తలు భారీగా తరలిరావాలని మలక్‌పేట నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ అజం అలీ కోరారు. శుక్రవారం అజంపురాలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వచ్చే పార్లమెంటరీ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం తీసుకోవాల్సిన ప్రణాళికలపై చర్చించేందుకు ఏర్పాటు చేస్తున్న ఈ సమావేశానికి భారీగా కార్యకర్తలు తరలిరావాలని ఆయన కోరారు. విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు లాయక్‌అలీ, కామేశ్ పాల్గొన్నారు.

భవానీ శంకర్ ఆలయంలో సీసీ కెమెరాలు ప్రారంభం



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న డీసీపీ ప్రవీణ్‌కుమార్, కార్పొరేటర్ ప్రేమ్

చైతన్యపురి: సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్‌పై ఉన్న శ్రీభవాని శంకర్ ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను స్థానిక కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డితో కలిసి ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో సీసీ కెమెరాల ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఏసీపీ జానకిరెడ్డి, సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు సీహెచ్ రాంరెడ్డి, అశోక్, జనార్దన్‌రెడ్డి, అశోక్‌గౌడ్, స్థానిక నాయకులు మధుసూదన్ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ఎస్ఐలు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, వివిధ మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని దిగువ తెలిపిన ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అధికారులు తెలిపారు.

◆ **ఉదయం 9 నుంచి 11 గంటల వరకు...**
గౌసియా మసీద్, అజంపురా వార్డ్ ఆఫీస్, అజంపురా కాంటా, డీసీ పటేల్ కాలనీ, మిలాద్ గల్లీ పరిసర ప్రాంతాలు

◆ **ఉ. 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు...**
అజంపురా చమన్, సహిఫా మజీద్, అజంపురా పోస్ట్‌ఫీస్ లేన్, అజంపురా కాంటా, టార్జాన్ గ్రౌండ్, హరిలాల్ బాగ్, సీ క్లాస్ పరిసర ప్రాంతాలు

◆ **మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు...**
లాలాజర్ లేన్, సోయబ్ మెమోరియల్ పార్క్, వాకీ గ్రౌండ్, వాలీబాల్ గ్రౌండ్, బ్యాంక్ ఆఫ్ బరోడా, గుల్జార్ మసీద్ పరిసర ప్రాంతాలు

◆ **సా.4 నుంచి 6 గంటల వరకు...**
చంచల్‌గూడ న్యూరోడ్, డైమండ్ హోటల్, అర్షద్ హోటల్, వైట్ హస్, రోషన్‌డైరీ, చంచల్‌గూడ కల్లా పరిసర ప్రాంతాలు.

ప్రకటన
ఫారం నం. URC-2

అధ్యాయం XXIలోని భాగం I క్రింద రిజిస్ట్రేషన్ గురించి ఇస్తున్న ప్రకటన
[కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 374(బి) మరియు కంపెనీల (రిజిస్ట్రేషన్ చేయడానికి అధికారం ఇవ్వబడిన) రూల్స్, 2014లోని రూల్ 4(1)కి అనుగుణంగా]

1. కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 366లోని సబ్-సెక్షన్ (2)కు అనుగుణంగా, భాగస్వామ్య సంస్థ అయిన **వేదగర్భ ఇన్‌ఫ్రాటెక్**, పేర్ల ద్వారా పరిమితం చేయబడిన కంపెనీగా, కంపెనీల చట్టం 2013లోని అధ్యాయం XXIలోని భాగం I క్రింద రిజిస్ట్రేషన్ అయ్యేందుకు హైదరాబాద్ వద్ద రిజిస్ట్రార్‌కు దరఖాస్తు చేయబడిందని ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.
2. **కంపెనీ యొక్క ప్రధాన లక్ష్యాలు:** కాంట్రాక్టర్లు, బిల్డర్లు, టౌన్ ప్లానర్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలపర్స్, ఎస్టేట్ డెవలపర్స్ మరియు ఇంజనీర్స్, ల్యాండ్ డెవలపర్స్, ల్యాండ్‌స్కేపర్స్, ఎస్టేట్ ఏజెంట్స్ మరియు స్థిరాస్తి డీలర్ల వ్యాపారం చేపట్టడం
ప్రతిపాదిత కంపెనీకి సంబంధించిన ముసాయిదా మెమోరాండం మరియు అసోసియేషన్ ఆర్టికల్స్ కాపీని ప్లాట్ నం.492, వేదహోమ్స్, 5వ అంతస్తు, ఫ్లాట్ నం.1, శ్రీరమణ కాలనీ, కర్మన్‌ఘాట్, హైదరాబాద్, తెలంగాణ - 500097 కార్యాలయం వద్ద తనిఖీ చేసుకోవచ్చును.
3. ఈ దరఖాస్తుకు అభ్యంతరం వ్యక్తం చేసే ఎవరేని వ్యక్తి తన అభ్యంతరమును వ్రాతపూర్వకముగా The Registrar of Companies, SF-302, GSI post, Corporate Bhavan Rd, Bandlaguda, Hyderabad, Telangana - 500068 వారికి ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి ఇరవై-ఒక్క రోజుల లోగా తెలియజేయవచ్చును. ఒక కాపీని నమోదిత కార్యాలయంలోని కంపెనీకి కూడా పంపవలెనని ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

దరఖాస్తుదారు(ల) పేర్లు:
1. జంగారెడ్డి అన్నం, 2. మౌనికా రెడ్డి అన్నం
తేది: 19 జనవరి, 2024

ప్రధాన సమస్యలన్నీ పరిష్కరిస్తాం: ఎమ్మెల్యే



హుడా భారతినగర్‌లో ఎస్ఎన్‌డీపీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలన్నింటినీ పరిష్కరించి ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యమని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్‌లోని హుడా భారతినగర్‌లో జరుగుతున్న ఎస్ఎన్‌డీపీ పనులను ఆయన అధికారులు, స్థానిక నాయకులు, కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గతంలో ఈ కాలనీలో ఎస్ఎన్‌డీపీ పనులను ప్రారంభించామని, ఆ పనుల్లో భాగంగా డ్రైన్ పనులకు ప్రస్తుతం ఉన్న స్థలంలో డ్రైన్‌కు అనుకూలంగా లేకపోవడంతో ప్రైవేటు స్థలయజమానిని ఒప్పించి కొంత స్థలం ఇవ్వడానికి అంగీకారం తీసుకున్నామన్నారు. కాగా, కాలనీలో డ్రైన్‌ను 90 డిగ్రీల కోణంలో నిర్మిస్తే చాలా ఇబ్బందులు వస్తాయని కాలనీవాసులు చెప్పన్నారని, వారి విజ్ఞప్తి మేరకు 45 డిగ్రీల కోణంలోనే డ్రైన్‌ను నిర్మించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. దానికి అనుగుణంగా అక్కడ రోడ్డుమీద ఉన్న విద్యుత్ స్తంభాన్ని పక్కకు జరపాలని సూచించారు. దీంతో కాలనీవాసులు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఈఈ కృష్ణయ్య, కిరన్‌సాగర్, విజయ్‌కుమార్, రాంచందర్, రవీందర్‌రెడ్డి ,హేమూనాయక్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు అండోజు సత్యంచారి, శ్రీనివాస్ నాయక్, రఘుమారెడ్డి, శివారెడ్డి, నాగిరెడ్డి, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు సత్కారం



సన్మానిస్తున్న మహ్మద్ మక్సూద్

చాదర్‌ఘాట్: ఎమ్మెల్సీలుగా నామినేషన్లు వేసిన కాంగ్రెస్ నాయకులు మహేష్‌కుమార్ గౌడ్, బల్మూరి వెంకట్‌లను సెట్విన్ సంస్థ మాజీ చైర్మన్ మహ్మద్ మక్సూద్ ఆధ్వర్యంలో నేతలు శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మక్సూద్ మాట్లాడుతూ, ఎమ్మెల్సీలుగా మహేష్‌కుమార్ గౌడ్, బల్మూరి వెంకట్‌ల విజయం సాధించి పార్టీని మరింత బలోపేతం చేస్తారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు చౌకి రవికుమార్, అర్వింద్ కుమార్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ వైస్ ప్రెసిడెంట్‌గా శ్రవణ్‌కుమార్



ఆర్.కృష్ణయ్య నుంచి నియామక పత్రం తీసుకుంటున్న శ్రవణ్‌కుమార్

మలక్‌పేట: జాతీయ బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ వైస్ ప్రెసిడెంట్‌గా మలక్‌పేటకు చెందిన శ్రవణ్‌కుమార్(రాజు) నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా శుక్రవారం నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ, జాతీయ నాయకత్వం తీసుకునే నిర్ణయాలకు అనుగుణంగా పని చేస్తూ సంఘాన్ని బలోపేతం చేస్తామన్నారు. టీపీసీసీ సెక్రటరీ కోట్ల శ్రీనివాస్, సంఘం ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, విద్యార్థి విభాగం అధ్యక్షుడు రామకృష్ణ పాల్గొన్నారు.